శ్రీరస్తు.. శుభమస్తు.. కల్యాణమస్తు..

- మాఘమాసం ప్రారంభంతో వరుస శుభ ముహూర్తాలు
- ఊపందుకున్న వ్యాపారాలు


వివాహానికి అలంకరించిన కల్యాణ మండపం

బిక్కవోలు: పెళ్లంటే పందిళ్లు.. తప్పెట్లు.. తాళాలు.. తలంబ్రాలు.. మూడే ముళ్లు.. ఏడే అడుగులు మొత్తం కలిపి నూరేళ్లు అన్నాడో సినీ కవి. మాఘ మాసం ఎప్పుడెస్తుందా అని ఎదురుచూస్తున్న శుభ ఘడియలు రానే వచ్చాయి. అనపర్తి, రాజానగరం, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి ఎక్కడ చూసినా పచ్చని పందిళ్లు దర్శనమిస్తున్నాయి. రానున్న రెండు నెలల పాటు అధిక సంఖ్యలో వివాహాలు జరగనుండడం, వీటికి తోడు గృహ ప్రవేశాలు, నూతన వ్యాపార ప్రారంభాలతో పురోహితులకు డిమాండ్ పెరిగిపోయింది.

మార్కెట్ కళకళ

ఈ నెల 22 నుంచే మాఘమాసం ప్రవేశించడంతో జనవరి 25 నుంచే పెళ్లి బాజాలు మోగనున్నాయి. జనవరి నెలలో 25, 26, 27, 28 తేదీల్లో, ఫిబ్రవరి నెలలో 1, 8, 9, 10, 15, 16, 22, 23, 24 తేదీల్లో, మార్చి నెలలో 1, 5, 8, 9, 10, 11, 15, 17, 18, 22, 23, 24, 25 తేదీల్లో పెళ్లిళ్లకు శుభ ముహూర్తాలు ఉన్నట్లుగా పురోహితులు చెబుతున్నారు. అందుకే అప్పుడే కల్యాణ మండపాలు కళ్లు చెదిరే సెట్టింగులతో సిద్ధమయ్యాయి. మార్కెట్‌లో బంగారం ధర రోజురోజుకూ పెరుగుతోంది. శుభ ముహూర్తాలు సమీపించడంతో బంగారంపై తీవ్ర ప్రభావం కనిపిస్తోంది. శుభకార్యాల కారణంగా పూల ధరలు సైతం మరింతగా పెరగొచ్చని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి.

డ్రోన్ ఫొటోగ్రఫీకి డిమాండ్

గగనతలం నుంచి అత్యంత క్వాలిటీతో ఫొటోలు తీసే డ్రోన్ ఫొటోగ్రఫీకి పెళ్లిళ్లలో డిమాండ్ పెరిగింది. జిల్లాలో డ్రోన్‌తో ఫొటోలు, వీడియోలు తీసేందుకు వ్యాపారులు ఒక్కో కార్యక్రమానికి రూ.10 వేల నుంచి 20 వేల వరకూ తీసుకుంటున్నారు. నియోజకవర్గంలో బ్యాండ్ మేళం గ్రూప్‌లు ఒక్కో కార్యక్రమానికి రూ.10 వేల వరకూ తీసుకుంటున్నారు. కొందరు పెళ్లిళ్లలో సంగీత విభావరులు నిర్వహిస్తున్నారు. దీనికి రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకూ సంగీత కళాకారులు తీసుకుంటున్నారు. ఇక వంట మాస్టర్ల గురించైతే చెప్పాల్సిన పనే లేదు. అయితే ప్రస్తుతం వరుస ముహూర్తాల నేపథ్యంలో అటు డ్రోన్ ఫొటోగ్రఫీ బృందాల్ని, ఇటు బ్యాండ్ మేళం గ్రూపుల్ని, వంట మాస్టర్లను పట్టుకోవడానికి పెళ్లి పెద్దలు నానా తంటాలు పడుతున్నారు.

మంచి ముహూర్తాలున్నాయి



జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో మంచి ముహూర్తాలున్నాయి. ప్రస్తుతం శుభ కార్యక్రమాలు చేసేందుకు వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఎక్కువ మంది వివాహాలు, గృహప్రవేశాలు, అక్షరాభ్యాసాలకు ముహూర్తాలు ఖరారు చేసుకుని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.
– గరిమెళ్ళ విశ్వేశ్వరరావు(బుజ్జి పంతులు), పందలపాక

రకరకాల వంటకాలపై దృష్టి



పెళ్లిళ్ల సీజన్ వస్తే చాలు రకారకాల వంటకాలతో భోజన ప్రియులను మెప్పించాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా సరికొత్త వంటకాలను తయారుచేస్తున్నాం.
– గొడ్డు సూర్యనారాయణ, వంట మాస్టర్, ఆరికరేవులు

సింగవరంలో ప్రచార రథం

సీతానగరం: శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి సనాతన హిందూ ధర్మ ప్రచార రథం సోమవారం సింగవరంలో పర్యటించింది. ఈ సందర్భంగా గోవిందనామ స్మరణతో గ్రామం మార్మోగింది. ఆదివారం సాయంత్రం వంగలపూడి నుంచి సింగవరం అభయాంజనేయస్వామి ఆలయం వద్దకు రథం చేరుకుంది. సోమవారం ఉదయం సర్పంచ్ సంగన చిన పోశియ్య తదితరుల ఆధ్వర్యంలో ప్రచార రథానికి భక్తులు ఘనంగా స్వాగతం పలికారు.

స్పందనకు మూడు వినతులు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మూడు వినతులు అందాయని డిప్యూటీ తహసీల్దార్ దొరకయ్య తెలిపారు. రంగంపేటలో సర్వే నంబరు 220/4 లో 4.40 ఎకరాల గ్రామ కంఠం భూమి ఎవరికి కేటాయించారో తెలపాలని గ్రామ సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మి ఒక వినతి, నల్లమిల్లి గ్రామంలో సర్వే నంబరు 199/2, 204/1 లో భూములు ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు కేటాయించడంపై అభ్యంతరం తెలుపుతూ మరొక అర్జీ, కోటపాడుకు చెందిన ఎర్రగోగుల సుబ్బయ్యమ్మ తన భూమిని ఆన్‌లైన్ చేయాలని ఇంకో వినతి అందించారని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

షెడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ


షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: స్థానిక పాతవూరు నల్లకాలువ గట్టు వద్ద ఉన్న సరస్వతీ దేవి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించే షెడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు సోమవారం శంకుస్థాపన చేసి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామానికి చెందిన చిర్ల వీర్రాఘవరెడ్డి సౌజన్యంతో ఈ షెడ్డును నిర్మించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, నల్లమిల్లి సూరారెడ్డి, సత్తి పోతారెడ్డి, కొండ, పితాని అబ్బులు, పితాని శేషారావు పాల్గొన్నారు.

అన్నసమారాధన ప్రారంభించిన ఎమ్మెల్యే

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో అన్నసమారాధన కార్యక్రమం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. సోమవారం సత్తెమ్మ తల్లి జాతర సందర్భంగా ముందుగా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు వడ్డించారు. కార్యక్రమంలో సర్పంచ్ బుంగా రామారావు, ఆలయ కమిటీ సభ్యులు నల్లమిల్లి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు కృతజ్ఞతలు


ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు కృతజ్ఞతలు తెలుపుతున్న డాక్టర్ బాబు

సీతానగరం: ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు దాసరి కార్పొరేషన్ డైరెక్టర్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి రమేష్‌బాబు (డాక్టర్‌బాబు) కృతజ్ఞతలు తెలిపారు. ఆయన సోమవారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. బీసీ పదవులను మరో రెండేళ్లు పొడిగించడంపై ధన్యవాదాలు తెలిపారు.

పవర్ లిఫ్టింగ్‌లో సాయికుమార్ ప్రతిభ


సాయికుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

రాజానగరం: జేఎన్‌టీయూ రాజాంలో ఇటీవల జరిగిన యూనివర్సిటీ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గైట్ కళాశాలలో ఎంబీఏ చదువుతున్న ఎ.సాయికుమార్ వెండి పతకం సాధించాడని ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ తెలిపారు. 93 కిలోల కేటగిరీలో ద్వితీయస్థానంలో నిలిచి ఈ పతకాన్ని అందుకున్నాడన్నారు. అలాగే అమలాపురంలో జరిగిన యునైటెడ్ ఈస్ట్ గోదావరి సూపర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో కూడా సాయికుమార్ ప్రతిభను చూపాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు.

దుప్పలపూడి పంచాయతీ వార్డు సభ్యుడి రాజీనామా

అనపర్తి: మండలంలోని దుప్పలపూడికి చెందిన 9వ వార్డు సభ్యుడు వాడ్రేవు చంద్రశేఖర్ తన పదవికి రాజీనామా చేసినట్లు సోమవారం ప్రకటించారు. వ్యక్తిగత కారణాల వల్ల వార్డు పదవికి రాజీనామా చేస్తున్నట్లుగా లేఖలో పేర్కొన్న ఆయన రాజీనామా లేఖను ఎంపీడీఓ బీఎల్ నరసింహంకు అందజేశారు. రాజీనామాపై తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఇదే పంచాయితీకి చెందిన గ్రామ ఉపసర్పంచ్(1వ వార్డు సభ్యురాలు) నల్లమిల్లి వినీల తన పదవికి రాజీనామా చేస్తూ ఈ నెల 20న రాజీనామా లేఖను ఎంపీడీఓకు అందజేసిన విషయం తెలిసిందే.

పుష్కర నీరు విడుదలపై హర్షం

మధురపూడి: మెట్ట గ్రామాలకు పుష్కర నీరు విడుదల చేయడంపై వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల కోరుకొండ మండల కన్వీనర్ కల్యాణం రాంబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. రబీకి సాగునీటి ఇబ్బంది కలగకుండా ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఈ చర్యలు తీసుకున్నారన్నారు. రైతన్నల కోరిక మేరకు ఇటీవల ఆయన సాగునీటిశాఖ అధికారులతో చర్చించి, ఆదేశాలిచ్చినట్టు తెలిపారు. గోకవరం మండలంలోని అచ్యుతాపురం, బాబాజీపేట, వెదురుపాక మీదుగా కోరుకొండ నర్సాపురం, కణుపూరు, గాదరాడ నుంచి రాజానగరం మండలం కలవచర్ల, సీతారాంపురం, నందరాడ గ్రామాల మీదుగా పుష్కర కాలువ నీరు ప్రవహిస్తోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఖరీఫ్ పంట సాగుకే నీరు ఇవ్వలేకపోయిందన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి


చీపురపల్లిలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- చీపురపల్లిలో గడప గడపకూ

సీతానగరం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చుతూ, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని చీపురపల్లిలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తొలుత మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మొక్కలను నాటారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి మూడున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలతో కూడిన బుక్‌లెట్లు పంపిణీ చేశారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయం

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ప్రధాన ధ్యేయంగా, రైతులు, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి, ఆర్థికంగా చేయూత అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వానికి భిన్నంగా చీపురపల్లి అభివృద్ధికి విశేషంగా కృషి చేశామన్నారు. నాడు నేడు పథకం ద్వారా సుమారు రూ.20 లక్షలతో పాఠశాల రూపురేఖలను మార్చామన్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు జలజీవన్ మిషన్ పథకంలో రూ.44 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టామని, ఎస్సీ కాలనీలో సీసీ డ్రైనేజీల నిర్మాణానికి రూ.35 లక్షలు ఖర్చు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరి బాబు, సర్పంచ్‌లు గోపిశెట్టి అనురాధ, దోశపాటి వీరచంద్రం, ఎంపీటీసీ బెడిసి లక్ష్మి, ఉప సర్పంచ్ అనిమిల్లి బుజ్జి, నియోజకవర్గం బూత్ కమిటీల చైర్మన్ గద్దె వెంకట కృష్ణచౌదరి (నల్లి), అత్తిరస కార్పొరేషన్ రాష్ట్ర కమిటీ డైరెక్టర్ జక్కు లక్ష్మి, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, గోపిశెట్టి తులసీరామ్, గోపిశెట్టి అచ్చారావు, మన్నెల వెంకట్రావు, మద్దాల కొండలరావు పాల్గొన్నారు.

నవరత్న పథకాలతో ఇంటింటా సంతోషం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం


గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు

అనపర్తి: పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న నవరత్న పథకాలతో ఇంటింటా సంతోషం నెలకొందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం అనపర్తి గ్రామ సచివాలయం–3 పరిధిలోని శేషగిరిరావు పేట, వర్తక సంఘం కల్యాణ మండపం, పంచాయతీ సమీప వీధుల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ పథకాలు అమలవుతున్న తీరుని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందడంలో జాప్యం జరిగితే తన దృష్టికి తీసుకురావాలని వారికి భరోసానిస్తూ గడప గడపకూ కార్యక్రమాన్ని కొనసాగించారు.

సీఎం జగన్‌తోనే సుపరిపాలన సాధ్యం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సుపరిపాలన సాధ్యమని, సీఎం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలే దీనికి నిదర్శనమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గడప గడపకూ కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకు వెళుతున్న ప్రజాప్రతినిధులకు ప్రజల ఆదరాభిమానాలే వైఎస్సార్ సీపీ పారదర్శక పాలనను తేటతెల్లం చేస్తున్నాయని చెప్పారు. టీడీపీ హయాంలో అభివృద్ధిని పూర్తిగా విస్మరించిన ఆ పార్టీ నేతలు నేడు అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక అడుగడుగునా అడ్డు తగులుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి, ఎంపీటీసీ కొండేటి భీమేష్, వార్డు మెంబర్ తేతల కళావతి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు సత్తి సత్యనారాయణరెడ్డి, పడాల కల్యాణ్‌రెడ్డి, చిర్ల వెంకటరెడ్డి, ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు చోరీ

సీతానగరం: చినకొండేపూడిలో సోమవారం మధ్యాహ్నం సినీ ఫక్కీలో బంగారు గొలుసు దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన కురుకూరి సుబ్రహ్మణ్యం ఇంటికి మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇద్దరు యువకులు వచ్చారు. ఒకడు చేతితో మిషన్ పట్టుకుని తలుపు తట్టాడు. కరెంట్ రీడింగ్ తీసుకోవడానికి వచ్చారని అనుకున్న సుబ్రహ్మణ్యం భార్య అనంతలక్ష్మి తలుపు గడియ తీసింది. ఆ యువకులు అకస్మాత్తుగా తలుపు గెంటడంతో ఆమె కింద పడిపోయింది. ఆ యువకులు తక్షణమే ఆమె మెడలోని నాలుగున్నర కాసుల బంగారు గొలుసు తెంపుకొని పారిపోతుండగా సుబ్రహ్మణ్యం పట్టుకునే ప్రయత్నం చేశారు. అతడిని గెంటివేయడంతో పడిపోయాడు. ఆ ఇద్దరు యువకులు పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై కె.శుభశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని సీసీ ఫుటేజ్ పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పోరాటయోధుడు సుభాష్ చంద్రబోస్


నేతాజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న నన్నయ అధికారులు


నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం అమ్మిరెడ్డి, విద్యార్థులు

రాజానగరం: దేశ స్వాతంత్య్రం కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జివీసీ ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. బోస్ జయంతిని పురస్కరించుకుని యూనివర్సిటీలోని ఈసీ హాలులో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వీసీ మాట్లాడుతూ తెల్లదొరలను దేశం నుంచి పారద్రోలడానికి అహింసా మార్గమొక్కటే సరిపోదని, సాయుధ పోరాటం కూడా అవసరమని చెప్పి అజాద్ హింద్ ఫౌజ్ పేరిట ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఆచార్య కేఎస్ రమేష్, ఆచార్య పి.సురేష్ వర్మ, డాక్టర్ వి.పెర్సిస్, డాక్టర్ ఎం. కమలాకుమారి, డాక్టర్ కె.నూకరత్నం, డాక్టర్ ఎం.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ధైర్య సాహసాలకు మారుపేరు నేతాజీ

బిక్కవోలు: నేతాజీ సుభాష్ చంద్రబోస్ ధైర్య సాహసాలకు మారుపేరని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి అన్నారు. సోమవారం పాఠశాల వద్ద నేతాజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమ్మిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నేతాజీ దేశభక్తిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గొలుగూరి రామారెడ్డి, కృష్ణసాయి, వలీషా, ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజం ఆరోగ్యంగా ఉంటేనే దేశ ప్రగతి


విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రంగంపేట: సమాజం ఆరోగ్యంగా ఉంటే మన దేశం కూడా ప్రగతి బాటలో పయనిస్తుందని గ్లోబల్ విజన్ స్కూల్ కరస్పాండెంట్ ముప్పిడి జాన్ డేన్ అన్నారు. నల్లమిల్లి గ్లోబల్ విజన్ హైస్కూల్‌లో సోమవారం ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఉచితంగా ప్రాథమిక వైద్యం, రక్త పరీక్షలు నిర్వహించారు. బుర్రకథ ద్వారా విద్యార్థులకు ఆరోగ్యవంతమైన జీవితంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సత్యవాణి, ఇన్‌చార్జి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శ


పాలచర్లలో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: నియోజకవర్గంలోని పలు బాధిత కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సోమవారం పరామర్శించారు. భూపాలపట్నంలో తోరాటి నాగేశ్వరరావు, దివాన్ చెరువులో మార్గాని మంగయమ్మ, చీర్రా రాజు, జి.ముసలయ్య, మందపల్లి సువర్ణ, మందపల్లి అజిత్, పాలచర్లలో అంకం పెద్ద నూకరాజు, కామిరెడ్డి బాబ్జి, కామిరెడ్డి రామలక్ష్మి, నురుకుర్తి సూర్యారావు, బొమ్మినేటి సత్యవతి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కోరుకొండ మండలం నిడిగట్లలో కుడుముల వెంకన్న, గంగులకుర్తి రాంబాబు, కొత్తపల్లి సూర్యాకాంతం, పల్ల గణపతి, తలారి సుబ్బారావు, సీతానగరం మండలం చినకొండేపూడిలో కోన శేషారావు, రాజు, సీతానగరంలో సైతన పుష్పలత, పెంట కొండయ్య, చల్లయ్య కుటుంబాలను పరామర్శించారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం

బిక్కవోలు: కొంకుదురు గ్రామానికి చెందిన విశ్రాంత గ్రంథాలయాధికారి కొత్తపల్లి వీర్రాఘవులు, సావిత్రి దంపతులు ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల చిన్న వెంకన్న స్వామి ఆలయానికి రూ.50 వేలు విరాళంగా అందించారు. ఆలయ ఈవో వేంద్ర త్రినాథరావుకు నగదును అందించినట్లు వీర్రాఘవులు సోమవారం తెలిపారు.

స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలి


స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు తదితరులు

రంగంపేట: ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యా భారతి స్టడీ మెటీరియల్‌ను పదో తరగతి విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు సూచించారు. మండలంలోని జి.దొంతమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. అనంతరం జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్నతో కలసి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గోలి వెంకటకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు గొల్లపల్లి రవి, గ్రామ కమిటీ కన్వీనర్ చెక్కపల్లి నాగేశ్వరరావు, హెచ్‌ఎం దుర్గాప్రసాద్, సీఆర్పీ సాయి తదితరులు పాల్గొన్నారు.

కంటి జాగ్రత్తలు తీసుకోవాలి


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కరీం

రంగంపేట: వైద్యుల సూచనలు పాటిస్తూ కంటి జాగ్రత్తలు తీసుకోవాలని వేమగిరి పరమహంస యోగానంద నేత్ర వైద్యాలయ వైద్యుడు కరీం సూచించారు. స్థానిక సత్యసాయి సమాజ సేవా కేంద్రంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 55 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లకు 9 మందిని, కళ్లజోళ్లు అవసరమైన 18 మందిని గుర్తించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల కన్వీనర్ మలిరెడ్డి వీర్రాజు, మెడికల్ ఇన్‌చార్జిలు మూర్తి, చంటి, సేవాదళ్ సభ్యులు వెంకటరావు, శేషసాయికిరణ్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

అనపర్తి: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, జీబీఆర్ విద్యాసంస్థల క్రీడామైదానంలో సోమవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ క్రికెట్ పోటీల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా పరిధిలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన మొత్తం 11 జట్లు పాల్గొననున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఆర్.నాగకుమార్ తెలిపారు. సోమవారం జరిగిన పోటీల్లో ఎంపీఎల్ అడ్మినిస్ట్రేషన్ జట్టుపై ఫైర్ డిపార్ట్‌మెంట్ జట్టు విజయం సాధించిందని పీడీ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కమర్షియల్ టాక్స్ జట్టుపై జీఎస్‌డబ్ల్యూఎస్ జట్టు, పశుసంవర్ధకశాఖ జట్టుపై రెవెన్యూ జట్టు, వ్యవసాయశాఖపై ఎక్సైజ్ జట్టులు విజయం సాధించాయని చెప్పారు. ఈనెల 24న సెమీఫైనల్స్, 25న ఫైనల్స్ నిర్వహించనున్నట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు.

సర్టిఫికెట్ల ప్రదానం


శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని దివాన్ చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధ్యక్షుడు సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. తోకాడకు చెందిన 60 మంది పేద మహిళలకు మగ్గం వర్కులో ఉచిత ఇచ్చారు. శిక్షకురాలు బొంతల లత ఆధ్వర్యంలో శిక్షణ పూర్తిచేసిన వారందరికీ దివాన్ చెరువులోని కార్యాలయంలో సోమవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుంకర వీరాస్వామి, తోకాడ యాష్ రూప్ స్కూలు ప్రిన్సిపాల్ అనురాధ పాల్గొన్నారు.

కాపు సంఘం మండల అధ్యక్షుడిగా సత్యం



సీతానగరం: కాపు సంఘం మండల అధ్యక్షుడిగా ఇనగంటివారిపేటకు చెందిన సత్యం రామకృష్ణ నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పురంశెట్టి మంగారావు ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన మండల సమావేశంలో ఆయనను ఎంపిక చేశారు. .

ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలి

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో ఇథనాల్ పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థ జలాలను తరలించే మార్గాన్ని చూపకపోవడంతో ప్రజారోగ్యానికి హాని కలిగే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి మరోతి శివగణేష్ అన్నారు. దీనిపై సోమవారం పలు శాఖలకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్టు వివరించారు.

కల్యాణానికి రాట ముహూర్తం


లక్ష్మీనరసింహస్వామి కల్యాణ రాట ముహూర్తం చేస్తున్న దృశ్యం

పెదపూడి: పెదపూడి మండలం పుట్టకొండ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి కల్యాణానికి గ్రామ సర్పంచ్ వల్లు వెంకటరమణ, ఆలయ ధర్మకర్త పీఏ అనంతాచార్యులు, అచంట నాగేశ్వరరావు ఉదయం 9.30 గంటలకు రాట ముహూర్తం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి.అనంత గోపాలాచార్యులు ఆధ్వర్యంలో పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ సీహెచ్‌వీ రమణమూర్తి మాట్లాడుతూ ఫిబ్రవరి 1న స్వామి కల్యాణం, రథోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో పెదపూడి సోమేశ్వరస్వామి ఆలయ ఈఓ వడ్డాది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.